సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 11 । అక్టోబర్ । 2025



ఒకే గది.. అంతేనా మా గతి

టెక్కలి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఒకే గదితో ఇబ్బంది పడుతున్నారు. - 8లో



నిబంధనలకు నీళ్లు

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు పాటించడం లేదు. అధికారుల తనిఖీలు కనిపించడం లేదు. - 8లో

జిల్లా సమీక్ష కమిటీ సమావేశం వాయిదా

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: ఈ నెల 11వ తేదీన జరగాల్సిన జిల్లా సమీక్ష కమిటీ సమావేశం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. తదుపరి నిర్వహించే తేదీ, సమయాన్ని తరువాత తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

పారదర్శకంగా పన్ను చెల్లింపు

ఎచ్చెర్ల: విద్యార్థులు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించగలరని, ఆర్థిక అవగాహనతో జీఎస్టీ పన్ను చెల్లింపుల్లో పారదర్శకత పాటించి దేశాభివృద్ధికి తోడ్పడాలని విశాఖపట్నం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటిలిజెన్స్ విభాగం, సీనియర్ ఇంటిలిజెన్స్ అధికారి డాక్టర్ కేవీ మోహనరావు అన్నారు. మండలంలోని కుశాలపురంలోని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సూపర్ జీఎస్టీ 2.0–సూపర్ సేవింగ్స్ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ వ్యవస్థ, దీని ప్రాముఖ్యత, పన్ను చెల్లింపులో పారదర్శకత యువతలో ఆర్థిక అవగాహన తదితర అంశాలను వివరించారు.

బయాలజీ కిట్లు అందజేత



జీవశాస్త్ర ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ

శ్రీకాకుళం: జిల్లాలో 2025 డీఎస్సీ నుంచి బయాలజీ టీచర్లుగా ఎంపికైన వారికి బయాలజీ మెటీరియల్ కిట్లను జిల్లా జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం అందజేసింది. డీఈఓ ఎ.రవిబాబు చేతుల మీదుగా ఈ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథంతో మంచి బోధన చేయాలని సూచించారు. పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణం మాట్లాడుతూ బయోలాజికల్ సైన్స్ ఎడ్యుకేషనల్ బ్యాక్ గ్రౌండ్ కలిగిన తాను జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం, జన విజ్ఞాన వేదికల నిర్వహించే సైంటిఫిక్ టెంపర్ క్యాంపస్‌లో భాగస్వామి అవుతానని పేర్కొన్నారు.


దూడల అక్రమ రవాణా అడ్డగింత



పోలీసులు సీజ్ చేసిన వాహనం

నరసన్నపేట: జాతీయ రహదారిపై అక్రమంగా లగేజీ వాహనంలో తరలిస్తున్న 16 దూడలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మడపాం టోల్ గేట్ వద్ద శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. తిలారు నుంచి అలమండకు అక్రమంగా ఈ దూడలను తీసుకువెళ్తున్నట్లు గురించారు. వీటిని నరసన్నపేట పోలీసులకు అప్పగించగా ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి గోశాలకు పంపించారు.

రాత్రిపూట రేషన్ కోసం పాట్లు



ఆమదాలవలస గేటు ప్రాంతంలోగల రేషన్ దుకాణంలో శుక్రవారం రాత్రి పడిగాపులు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోని గేటులో గల రేషన్ దుకాణం వద్ద శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల తర్వాత కూడా రేషన్ కోసం లబ్ధిదారులు వేచి ఉండడం కనిపించింది. ఒకప్పుడు ఇంటి ముంగిటకే సరుకులు వచ్చేవని, ఇప్పుడు రాత్రి సమయాల్లో ఇలా వేచి ఉండాల్సి వస్తోందని అన్నారు.

● అంత్యోదయ చూపలేరా..?

చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు జన్ని గౌరమ్మ. దివ్యాంగురాలైన గౌరమ్మకు 2006లో అప్పటి ప్రభుత్వం అంత్యోదయ కార్డు మంజూరు చేసింది. హిరమండలం మండలం లోకొండ గ్రామానికి చెందిన గౌరమ్మకు తల్లిదండ్రులు లేరు. వివాహం కూడా జరగలేదు. ఒంటరిగానే జీవిస్తున్నారు. ఈ కార్డే ఆమెకు ఆధారం. కానీ కొన్నాళ్ల కిందట ఆమెకు అంత్యోదయ కార్డు తొలగించారు. అప్పటి నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఆమెపై ఎవరూ దయ చూపడం లేదు. ఇప్పటికైనా తన బాధను గమనించి కార్డు పునరుద్ధరించాలని ఆమె కోరుతున్నారు. - హిరమండలం





శ్రీకాకుళం రూరల్: ధర్మాన క్యాంపు కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణలో ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, అంధవరపు సూరిబాబు తదితరులు



నరసన్నపేట: కోటి సంతకాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు తదితరులు



కవిటి: కోటి సంతకాల సేకరణ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, పార్టీ పరిశీలకులు దుంపల లక్ష్మణరావు



కోటబొమ్మాళి మండలం చిన్నబమ్మిడిలో రచ్చబండ, సంతకాల సేకరణ గురించి వివరిస్తున్న టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్

● ఉద్యమానికి శ్రీకారం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ప్రజా ఉద్యమానికి పిలుపునిచ్చింది. అందులో భాగంగా శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మొదలుపెట్టడంతో పాటు ఉద్యమానికి సంబంధించిన పోస్టర్లను కూడా నాయకులు ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వ దుర్నీతిని దునుమాడాలని జనాలకు పిలుపునిచ్చారు. ప్రైవేటువాళ్లకు అప్పగిస్తే పేదలకు వైద్య విద్య పూర్తిగా దూరమవుతుందని హెచ్చరించారు. -సాక్షి నెట్‌వర్క్

విజయవంతం చేయాలి

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన మెడికల్ కాలేజీలు అన్నీ ప్రభుత్వమే పూర్తి చేయాలి. పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు అప్పగిస్తే పేదలకు వైద్యం అందదు. కూటమి ప్రభుత్వ విధానం తప్పు. పేద విద్యార్థులు డాక్టర్లు అయ్యే అవకాశం కోల్పోతారు. కూటమి ప్రభుత్వం తీరుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ఉద్యమంతో పాటు వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలి.

– వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



ఎచ్చెర్ల: సంతకాల సేకరణ చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తదితరులు

పిడుగు పాటా.. బ్లాస్టింగా..!



గంగరాజపురం గ్రానైట్ క్వారీ సంఘటనపై భిన్నాభిప్రాయాలు



- బ్లాస్టింగ్ కోసం అమర్చిన పేలుడు పదార్థాలు పిడుగు దెబ్బకు పేలినట్టు అనుమానాలు
- కీలక నేత సోదరుడి జోక్యంతో వాస్తవాలు బయటకు రావడం లేదన్న వాదనలు
- దబ్బగూడ క్వారీ బాధ్యులపై ఎంత మేరకు చర్యలు తీసుకున్నారో తెలియని పరిస్థితి
- యాజమాన్యాలకు అనుకూలంగా మంతనాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

క్వారీల్లో ప్రమాదాలపై అనుమానాలు ఆగడం లేదు. మొదట పిడుగు పడింది అని చెప్పడం ఆపై తీరిగ్గా బ్లాస్టింగ్ వల్ల చనిపోయారని తేల్చడం పరిపాటిగా మారిపోయింది. ఆ మధ్య దబ్బగూడలోని మానీస్ కూనపురెడ్డి క్వారీలో ప్రమాదకరంగా ముగ్గురు దుర్మరణం చెందారు. మృతదేహాలను కిందకు తెచ్చేసి పిడుగు పాటే కారణమని చిత్రీకరించారు. కుటుంబ సభ్యులు ప్రతిఘటించి, నిరసనకు దిగడంతో అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పిడుగు పాటు కాదని బ్లాస్టింగ్ అని తేల్చారు. తాజాగా గంగరాజపురంలో రాజ్‌యోగి గ్రానైట్ క్వారీలో కూడా ప్రమాదకరంగా ముగ్గురు మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కూడా పిడుగు పాటు వల్లే అని చెబుతున్నారు. కానీ వాస్తవ పరిస్థితి వేరనే వాదనలు ఉన్నాయి. ఇక్కడ కూడా బ్లాస్టింగ్ కోసం సిద్ధం చేసి ఉండగా, పిడుగు పాటుకు గురై అవి పేలడంతో మరణాలు సంభవించినట్లు అనుమానాలు ఉన్నాయి.

అన్నీ తానై...

జిల్లా గ్రానైట్ క్వారీలకు కీలక నేత సోదరుడు నాయకత్వం వహిస్తున్నారు. అంతా తానై వ్యవహరిస్తున్నారు. ఆయన కనుసన్నల్లోనే క్వారీలు నడుస్తున్నాయి. అధికార వర్గాలు సైతం జీ హుజూర్ అంటున్నాయి. ఏ క్వారీకి అనుమతులు ఇవ్వాలి? ఏ క్వారీకి అడ్డంకులు సృష్టించాలి? ఏ క్వారీకి పర్మిట్‌లు ఇవ్వాలి? ఏ క్వారీకి పర్మిట్‌లు ఇవ్వకూడదు? ఏ బ్లాక్‌లను ఏ ట్రాలీ రవాణా చేయాలి? ఏ ట్రాలీ రవాణా చేస్తే అడ్డుకోవాలి? తదితర నిర్ణయాలన్నీ ఆ కీలక నేత సోదరుడే అమలు చేస్తున్నారు. తన అనుచరులు కాని వారికి ఉన్న క్వారీలన్నీ చాలా వరకు నడవని పరిస్థితి ఉంది. ఇదే సమయంలో తన గుప్పెట్లో ఉన్న గ్రానైట్ క్వారీలకు కష్టం వచ్చినా, నష్టం వచ్చినా బాధితులకు అన్యాయం జరిగినా యాజమాన్యాలకు అనుకూలంగా ఉంటున్నారు. ఆ క్రమంలో ఎక్కడైనా క్వారీల్లో ప్రమాదాలు జరిగితే మేనేజ్ చేయిస్తున్నారు.

ఈ నేపథ్యంలో గతంలో మెళియాపుట్టి మండలం దబ్బగూడ సమీపంలో మానీష్ కూనపురెడ్డి గ్రానైట్ క్వారీలో జరిగిన సంఘటనలో మొదటగా పిడుగుపాటు అని యాజమాన్యం మభ్యపెట్టే ప్రయత్నం చేసినప్పటికీ మృతదేహాలపై వస్త్రాలు చిరిగిపోవడం, అవయవాలు చెల్లా చెదురుగా పడిపోవడంతో పాటు వారంతా స్థానిక కార్మికులు కావడంతో ఆయా కుటుంబాలు అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగడంతో అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి. చివరగా బ్లాస్టింగ్ వల్లనే కార్మికులు మృత్యువాత పడినట్లు తేలింది. అయితే ఈ సంఘటనకు సంబంధించి కేసులో బాధ్యులపై ఎంత మేరకు చర్యలు తీసుకున్నారనే విషయమై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

తెరపైకి భిన్నకథనాలు

ఇప్పుడు తాజాగా గంగరాజపురం సమీపంలో రాజ్‌యోగి గ్రానైట్ క్వారీలో జరిగిన సంఘటనలో మృత్యువాత పడిన వారంతా రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్‌కు చెందిన కార్మికులు కావడంతో స్థానికంగా సంఘటనపై గట్టిగా నిలదీసే పరిస్థితులు కనిపించలేదు.

- సంఘటన జరిగిన రోజు సాయంత్రం బ్లాస్టింగ్ కోసం పేలుడు పదార్థాలు అమర్చి కొంత దూరంలో తలదాచుకున్న క్రమంలో ఒక్క సారిగా పిడుగులు రావడం, ఆ ప్రభావంతో ఒక్క సారిగా విద్యుత్ ప్రసరణ జరిగి ఇదే క్రమంలో కార్మికుల సమీపంలో దాచిపెట్టిన పేలుడు పదార్థాలు బ్లాస్టింగ్ కావడంతో సంఘటన జరిగినట్లు భిన్నమైన కథనాలు తెరపైకి వస్తున్నాయి.
- పిడుగుపాటుకు గురైన వ్యక్తులకు వస్త్రాలు చిరిగిపోయి బలమైన గాయాలు కావడం వంటి సంఘటనలు జరుగుతాయా అనే సందేహాలు చోటు చేసుకుంటున్నాయి.
- మరో వైపు విద్యుత్ షాక్ వలనే కార్మికులు మృత్యువాత పడ్డారంటూ పలు ప్రజా సంఘాలు టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగాయి.
- ఈ సంఘటనలో మృతి చెందిన వారికి స్థానికంగా సరైన బలం లేకపోవడంతో కీలక నేత సోదరుడు మరో సారి వ్యవహారం చక్కదిద్దేందుకు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.
- ఎక్కడా అనుమానం రాకుండా బాధితులను, అధికారులను మేనేజ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.
- క్వారీలో జరిగిన సంఘటన పిడుగుపాటుతో జరిగిందా, లేక బ్లాస్టింగ్ వలన జరిగిందా, ప్రజా సంఘాలు ఆరోపించినట్లుగా విద్యుత్ షాక్ వలన జరిగిందా అనేది తేల్చాల్సి ఉంది. ఏది ఏమైనప్పటికీ కీలక నేత సోదరుడి కనుసన్నల్లోనే వ్యవహారం చక్కదిద్దేలా మంతనాలు జరుగుతున్నాయని సమాచారం.

డయాలసిస్ సేవలు సకాలంలో అందాలి

- జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ



జిల్లా స్థాయి సంఘ సమావేశంలో నివేదికలు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ

శ్రీకాకుళం: జిల్లాలోని కవిటి, సోంపేట మండలాల్లో కిడ్నీ వ్యాధి బారిన పడిన వారికి డయాలసిస్ సేవలు సకాలంలో అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో పలు స్థాయి సంఘ సమావేశాలు ఆమె అధ్యక్షతన జరిగాయి. ఆమె మాట్లాడుతూ జిల్లా పరిషత్ సాధారణ సభ్య సమావేశాలు, స్థాయి సంఘ సమావేశాలకు జిల్లా అధికారులు రాకుండా వారి ప్రతినిధులను పంపుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా అధికారులు రాని పరిస్థితుల్లో ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. 4వ స్థాయి సంఘ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో డయాలసిస్ బెడ్‌లు పెంచాలని అధికారులను కోరారు. 2వ స్థాయి సంఘ సమావేశంలో జిల్లాలో చాలా మంది అర్హుల పింఛనుల జాబితాలు ఎంపీడీఓల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయని సభ్యులు తెలపడంతో వాటిని క్లియర్ చేయడంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. 2వ స్థాయి సంఘ సమావేశంలో డీడబ్ల్యూఎంఏ చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. 7వ స్థాయి సంఘ సమావేశంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ పనులు నిర్దేశించిన కాలంలో చేయకుండా కాలం చెల్లిన, మొదలు పెట్టని పనుల వివరాలు ఇవ్వాలని తెలిపారు. ఉద్దానం ప్రాజెక్టు పైప్‌లైనులు ఎక్కువగా లీక్‌లు అవుతున్నాయని, సత్వరమే మరమ్మతులు చేపట్టి నీటి వృధాను అరికట్టాలన్నారు.

ఉదయం 3, 5, 6 వ స్థాయి సంఘ సమావేశాల్లో ప్రగతి నివేదికలను అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో ఆమదాలవలస ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్, సీఈఓ డి.సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు ధర్మాన కృష్ణ చైతన్య, జంపు కన్నతల్లి, సురవరపు నాగేశ్వరావు, కె.త్రినాథ్, టొంపల సీతారాముడు, కాయల రమణ, కామాక భాగ్యవతి, మీసాల సీతంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలపై బకాయిల పిడుగు



- ఆరేళ్ల కిందటి బకాయిలు చెల్లించాలని నోటీసులు
- ఇబ్బందులు పడుతున్న పంచాయతీ పాలకులు



సోంపేట:

సచివాలయాలతో మొదలుపెట్టి స్థానిక పాలనను నిర్వీర్యం చేస్తూ వస్తున్న కూటమి ప్రభుత్వం కన్ను ఇప్పుడు పంచాయతీలపై పడింది. ఇప్పటికే నిధుల లేమితో ఇబ్బంది పడుతున్న పంచాయతీల నెత్తిన సర్కారు పిడుగు వేసింది. 2016 నుంచి 2019 కాలంలో ఈఈఎస్‌ఎల్ సంస్థకు బకాయి ఉన్న విద్యుత్ బల్బుల నిర్వహణ నిధులు చెల్లించాలని మండల అధికారులకు నోటీసులు జారీ చేశారు. 2024 ఆగస్టు నుంచి సెప్టెంబరు 2025 వరకు ఒక్క రూపాయి కూడా పంచాయతీల్లో కూటమి ప్రభుత్వం నిధులు జమచేయలేదు. అయితే సెప్టెంబరు 2025 లో మండలంలోని 23 పంచాయతీలకు సుమారు రూ.1.50 కోట్లు నిధులు జమ చేసింది. దీంతో ఆ నిధులు ఎటూ చాలక పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. క్లాప్ మిత్ర వేతనాలు, విద్యుత్ బల్బుల నిర్వహణ, తాగునీటి పథకాల నిర్వహణ, పారిశుద్ధ్యం గత ఏడాదిగా చేసిన పనులకు ఆ బిల్లులు సరిపోలేదు. దీంతో ప్రస్తుతం పంచాయతీలు నిధులు లేక ఖాళీగా ఉన్నాయి.

బకాయిలు చెల్లించాలని నోటీసులు

2016 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో పంచాయతీల్లో విద్యుత్ బల్బుల నిర్వహణ చేపట్టాలని ఈఈఎస్‌ఎల్ సంస్థకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. అప్పట్లో ఆ సంస్థ విద్యుత్ బల్బుల నిర్వహణ చేపట్టింది. కానీ అప్పట్లో ఆ సంస్థకు బకాయిలు చెల్లించలేదు. ఆ బకాయిలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం రావడంతో ఈఈఎస్‌ఎల్ సంస్థ తమ బకాయిల గురించి ప్రభుత్వాన్ని అడిగింది. దీంతో ప్రభుత్వం ఆదేశాల మేరకు అప్పటి బకాయిలు ఇప్పుడు చెల్లించాలని పంచాయతీలకు మండలస్థాయి అధికారులు గత నెల రోజులుగా నోటీసులు అందజేస్తున్నారు. కానీ పంచాయతీ సర్పంచ్‌లు బకాయిలు చెల్లించడానికి ససేమిరా అంటున్నారు. అప్పటి బకాయిలు ఇప్పుడు ఎలా చెల్లిస్తామని ప్రశ్నిస్తున్నారు. సుమారు కోటి యాభైలక్షల రూపాయల నిధులు పంచాయతీ ఖాతాల్లో జమచేసి ప్రస్తుతం రూ.60 లక్షల నిధులు చెల్లించాలని సోంపేట మండలంలో 23 పంచాయతీలకు నోటీసులు అందజేశారు. దీంతో సగం నిధులు బకాయిలు చెల్లించడానికి, మరో సగం నిధులు సెస్ చార్జీలు చెల్లించడానికి సరిపోతాయని వాపోతున్నారు. ఇలా నిధులన్నీ అయిపోతే పంచాయతీల్లో అభివృద్ధి పనులెలా అని ప్రశ్నిస్తున్నారు.



స్తంభానికి ఏర్పాటుచేసిన విద్యుత్ బల్బు

ఇబ్బంది పెడుతున్నారు



పంచాయతీల్లో అప్పులు చేసి పనులు చేస్తున్నాం. ఇప్పుడు కొంత నిధులు ఇచ్చి పాత బకాయిలు చెల్లించమని నోటీసులు అందజేస్తున్నారు. పంచాయతీ సర్పంచ్‌లను ఇబ్బందులకు గురిచేయడమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది.

– పాతిన శేషగిరి, మామిడి పల్లి సర్పంచ్

పాతబకాయిలు చెల్లించాలి

2016–19 మధ్య కాలంలో ఈఈఎస్‌ఎల్ సంస్థ పంచాయతీల్లో విద్యుత్ బల్బులు నిర్వహణ చేపట్టింది. నేడు కేవలం విద్యుత్ బల్బులు వేసిన ఖర్చులు మాత్రమే సంస్థ అడుగుతోంది. పంచాయతీ సర్పంచ్‌లు సహకరించి బకాయిలు చెల్లించాలి.

– సీహెచ్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ

బకాయిలు చెల్లించాలనడం దారుణం



కూటమి ప్రభుత్వం మాటలకు చేతలకు పొంతన లేదు. పంచాయతీలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. కూటమి పాలనలో పంచాయతీలకు నిధులు లేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు కొంత జమ చేసి పాత బకాయిలు చెల్లించమనడం దారుణం.

– శిలగాన భాస్కరరావు, సుంకిడి సర్పంచ్

ఆరోగ్యశ్రీ ఆగింది



జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో వైద్యసేవల కోసం వేచి ఉన్న ఆరోగ్యశ్రీ రోగులు

- ఎమర్జెన్సీ సేవలు సైతం నిలిపివేసిన నెట్‌వర్క్ ఆస్పత్రులు
- ఈహెచ్‌ఎస్ సేవలకూ మంగళమే
- ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లను అనుమతించ వద్దంటున్న 13 ఆస్పత్రుల యాజమాన్యాలు
- ఇప్పటికే రూ.147 కోట్ల వరకు పెరిగిన ప్రభుత్వ బకాయిలు

అరసవల్లి: పేదల పాలిట సంజీవనికి కష్టకాలం దాపురించింది. పైసా విదల్చని ప్రభుత్వ వైఖరితో పేదల వైద్యం ప్రమాదంలో పడింది. ఎప్పటి నుంచో బకాయిలు చెల్లించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టనట్టే వ్యవహరించడంతో శుక్రవారం నుంచి జిల్లాలో ఉన్న 13 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో కూడా ఆరోగ్యశ్రీ సేవలను పూర్తిగా నిలిపివేశారు. అలాగే ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (ఈహెచ్‌ఎస్) సేవలను కూడా మూడు నెలల మునుపే నిలిపివేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ సేవలను కార్పొరేట్/ప్రైవేటు ఆస్పత్రులు నిలిపివేసేలా చర్యలకు దిగడం ఇది మూడోసారి.

బకాయి రూ.147 కోట్లు

జిల్లాలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద 17 ప్రభుత్వ ఆస్పత్రులు, 13 ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు నగదు రహిత వైద్య సేవలు అమలు చేస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఆశా (ఏపీ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్) ప్రతినిధుల మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలను, ఈహెచ్‌ఎస్ సేవలను శుక్రవారం నుంచి నిలిపివేశారు. నెల రోజుల కిందటి నుంచి ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ఎమర్జెన్సీ సర్వీసులకు మాత్రం ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఈ నెట్‌వర్క్ ఆస్పత్రులు అనుమతించాయి. అయితే ఈ సారి సర్కారు నిర్లక్ష్య వైఖరి వీడకపోవడంతో ఎమర్జెన్సీ సర్వీసులను కూడా పూర్తిగా నిలిపివేశారు. దీంతో జిల్లా కేంద్రంలో కిమ్స్, మెడికవర్, జెమ్స్ తదితర సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సల కోసం వచ్చిన రోగులకు అనుమతి లభించకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురై వెనుదిరగాల్సి వచ్చింది. జిల్లాలో ఉన్న ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.147 కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లు ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంది.



శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కియోస్క్ వద్ద నమోదుకు రోగులు లేని దృశ్యం

ఉన్నతాధికారులకు నోటీసులు పంపించాం



జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసినట్లు ఆశా ప్రతినిధులు నోటీసులు అందజేశారు. ఈ నోటీసులను జిల్లా కలెక్టర్, వైద్య శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే పంపించాం. మొత్తం 9 ఆస్పత్రులు మాత్రమే సమ్మెలో పాల్గొంటున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఎమర్జెన్సీ సేవలను కూడా కొన్ని ఆస్పత్రుల్లో అనుమతి ఇస్తున్నట్లు సమాచారం.

– డాక్టర్ ప్రకాశరావు, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవల కో ఆర్డినేటర్

ఆందోళనలో రోగులు

జిల్లాలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలు ఒక్క సారిగా నిలిచిపోవడంతో జిల్లా వ్యాప్తంగా పలు రకాల క్షతగాత్రులు, రోగులు శస్త్ర చికిత్సలు చేయించుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏ ఆస్పత్రికి వెళ్లినా శుక్రవారం ఉదయం నుంచి ఎలాంటి కేసును అనుమతించకపోవడంతో రోగులు మనోవేదనకు గురై ప్రైవేట్ ఆస్పత్రుల వైపు అడుగులు వేశారు. జిల్లాలో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సగటున రోజుకు సుమారు 100 మంది రోగులు ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సల కోసం ఆధారపడుతున్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసి బీమా పథకంగా మార్పులు చేయించి తద్వారా ప్రైవేట్ వ్యక్తులకు వైద్యాన్ని అందించేలా ప్రభుత్వం చర్యలకు దిగుతోందని తెలుస్తోంది. దీనిపై రోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

కొల్లివలస ఎంపీటీసీకి గాయాలు



అపస్మారక స్థితిలో ఉన్న జనసేన ఎంపీటీసీ విక్రమ్

శ్రీకాకుళం, శ్రీకాకుళం క్రైమ్ : బూర్జ మండలం కొల్లివలస గ్రామానికి చెందిన ఎంపీటీసీ అంపిలి విక్రమ్ అలియాస్ విక్కీపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చారని అతని సోదరి మాధురి ఆరోపించారు. ఆయన శుక్రవారం రాత్రి అపస్మారక స్థితిలో ఉండడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తీసుకువచ్చారు. ఇక్కడే ఆస్పత్రిలో పనిచేస్తున్న మాధురి విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం మధ్యాహ్నం విక్కీ టెన్షన్ పడుతూనే శ్రీకాకుళంలోని తన ఇంటికి వచ్చాడని, ఏం అడిగినా చెప్పలేదని, భోజనం చేయమని చెప్పినా తినలేదని, విపరీతంగా ఫోన్ కాల్స్ వస్తుండటంతో టెన్షన్ పడ్డాడని అన్నారు. ఫోన్ చార్జింగ్ పెట్టి పడుకున్న విక్కీ సాయంత్రం నాలుగున్నర గంటలైనా లేవలేదని, అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి రిమ్స్‌కు తరలించామన్నారు. గ్రామంలో తన సోదరుడికి ఆస్తి వివాదాలు ఉన్నాయని, శుక్రవారం దీనిపై పంచాయితీ జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఆస్పత్రిలో విక్కీని గమనిస్తే ఛాతీ మీద ఎడమ వైపు గాయాలు కనిపించాయని ఆమె చెప్పారు. దీనిపై రిమ్స్ ఔట్‌పోస్టు పోలీసులను 'సాక్షి' సంప్రదించగా విక్రమ్‌ను ఆస్పత్రిలో చేర్చారని, రాత్రి 10.45 గంటల సమయంలో వేరే ఆస్పత్రికి తీసుకెళ్లిపోయారని, ఆయన అపస్మారక స్థితిలో ఉన్నారని చెప్పారు.

పకడ్బందీగా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలు పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్షించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఏఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ సీహెచ్.వివేకానంద, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ గెడ్డమ్మ, బీసీ సంక్షేమాధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఒకే గది.. అంతేనా మా గతి!





టెక్కలి గిరిజన ఆశ్రమ పాఠశాలలో తరగతి గదిలోనే రాత్రిపూట నిద్రిస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్లో) అదే గదిలో పగటిపూట బోధన

- బోధన, వసతికి ఒకే భవనం
- గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల అవస్థలు
- అసంపూర్తి భవనాలు పూర్తి చేయాలని వేడుకోలు

టెక్కలి: పాలకుల నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారుతోంది. టెక్కలి ఆదిఆంధ్రా వీధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకే గదిలో బోధన.. వసతితో అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు సుమారు 141 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల వేళల్లో తరగతి గదిలో పాఠాలు నేర్చుకుంటూ.. రాత్రి వేళల్లో అదే గదిలో నిద్రపోతున్నారు.

అసంపూర్తిగా భవనాలు..

గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థుల కోసం అంజనాపురం సమీపంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో సుమారు 8.75 కోట్ల రూపాయలతో అదనపు భవనాలకు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం అవి అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులకు వసతి గదుల కష్టాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

ఇబ్బంది పడుతున్నాం...



పాఠశాల తరగతి గదుల్లోనే రాత్రి వేళల్లో నిద్రిస్తున్నాం. చాలీచాలని గదులతో ఒక్కోసారి ఇబ్బందులు పడుతున్నాం. పాఠశాలకు సమీపంలో చేపట్టిన భవనాల నిర్మాణం పూర్తి చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– జి.యశ్వంత్, విద్యార్థి, గిరిజన ఆశ్రమ పాఠశాల, టెక్కలి

అధికారులకు చెప్పాం...



పాఠశాలలో పూర్తి స్థాయిలో తరగతి గదులు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఇప్పటికే అధికారులకు తెలియజేశాం. అసంపూర్తి భవనాల విషయమై ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

– నందీశ్వరరావు, హెచ్ఎం, గిరిజన ఆశ్రమ పాఠశాల, టెక్కలి

వచ్చే నెల 22 నాటికి కోటి సంతకాల సేకరణ పూర్తి

సాక్షి, విశాఖపట్నం : నర్సీపట్నంలో వైద్య కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9న చేపట్టిన పర్యటనను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులు, ప్రజలకు ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ సీపీ నాయకులతో శుక్రవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణను నర్సీపట్నం నుంచే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. నవంబర్ 22లోపు కోటి సంతకాల సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో 50 నుంచి 60 వేల సంతకాల సేకరణ చేపట్టాలని, ప్రతీ గ్రామంలో 500 సంతకాలు తగ్గకుండా చూడాలని సూచించారు. ఈ నెల 28న ప్రతి నియోజకవర్గంలో నిరసన కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియను నవంబర్ 22వ తేదీకి పూర్తి చేసి 23న ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తలు ఈ ప్రతులను పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపించాలన్నారు. నవంబర్ 26న పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ముఖ్యనేతలు రాష్ట్ర గవర్నర్‌ను కలిసి వీటిని అందజేస్తారన్నారు. సోషల్ మీడియా వేదికగా ఈ వినూత్న కార్యక్రమం ప్రచారం చేయాలని.. ఆ బాధ్యత సోషల్ మీడియా యాక్టివిస్టులు తీసుకోవాలని సూచించారు. జిల్లా, మండల, గ్రామ అనుబంధ విభాగాల కమిటీల నియామకం కూడా నవంబర్ 22 నాటికి పూర్తికావాలన్నారు. కల్తీ మద్యంపై వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈనెల 13న నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సమన్వయకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

టెక్కలిలో సైబర్ మోసం

టెక్కలి రూరల్: టెక్కలికి చెందిన టి.వాసంతి అనే మహిళ వాట్సాప్ నంబర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హ్యాక్ చేసి తన స్నేహితుల నుంచి డబ్బులు కాజేశారు. ఈ మేరకు బాధితురాలు శుక్రవారం టెక్కలి పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. తన ఫోన్‌పే పని చేయడం లేదని, అత్యవసరంగా రూ.35వేలు కావాలని, తాను పెట్టిన క్యూఆర్ కోడ్‌కు డబ్బులు పంపాలని వాసంతి వాట్సాప్ నంబర్ ద్వారా బెంగళూర్‌కు చెందిన ఆమె సన్నిహితులుకు మెసేజ్ వెళ్లడంతో వారు రూ.35వేలు పంపించారు. విషయం తెలుసుకున్న వాసంతి తన నంబర్ హ్యాక్ అయిందని గుర్తించి టెక్కలి పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు.

భార్యను చంపి..

ప్రమాదంగా చిత్రించి..

- కొరాపుట్‌లో టెక్కలి యువతి దారుణ హత్య



భార్య ప్రియాంక పండాతో శివ శంకర్ పాత్రో(ఫైల్)



కొరాపుట్ పోలీస్ స్టేషన్ ముందు టెక్కలి వాసులు

కొరాపుట్: భార్యను చంపేసి.. ప్రమాదంగా చిత్రించాడో ప్రబుద్ధుడు. ఆయన పోలీసు కావడం విశేషం. కొరాపుట్ జిల్లా కేంద్రంలో ఓఎంపీ కాలనీలో ఐఆర్‌బీ జవాన్ శివ శంకర్ పాత్రో నివాసంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి అతని భార్య ప్రియాంక పండా మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. అందరూ ఇది ప్రమాదమే అని అనుకున్నారు. కానీ ప్రియాంక తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి కొరాపుట్‌లో సంఘటన స్థలానికి చేరుకున్న తర్వాత కేసు మలుపు తిరిగింది. వారు తమ కుమార్తె మృతదేహం చూసి అనుమానం వ్యక్తం చేయడంతో అసలు విషయం బయటపడింది. ప్రస్తుతం నిందితుడిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..

శ్రీకాకుళం జిల్లా టెక్కలి పెద్ద బ్రాహ్మణ వీధికి చెందిన తరణి పండా తన కుమార్తె ప్రియాంకని నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాంకి చెందిన ఐఆర్‌బీ కానిస్టేబుల్ శివ శంకర్ పాత్రోకి ఇచ్చి గత ఏడాది జులై 11న టెక్కలిలో వివాహం జరిపించారు. వివాహ సమయంలో 12 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు వరకట్నంగా ఇచ్చారు. నూతన దంపతులు కొరాపుట్ ఓఎంపీ కాలనీ నివాసం ఉండడంతో వారికి అవసరమైన సారె కింద ఇంటి సామగ్రి ఇచ్చారు. కానీ పెళ్లైన నాటి నుంచి అదనపు కట్నం కోసం ప్రియాంకపై భర్త భౌతిక దాడులు చేసేవాడు. ఇది తెలిసి కన్నవారు తమ శక్తి మేరకు అదనపు కట్నం పంపుతుండేవారు. భర్త వేధింపులతో ప్రియాంక పుట్టింటికి వెళ్లి సెప్టెంబర్ 4న తిరిగి కొరాపుట్ వచ్చింది. కానీ వేధింపులు ఆగలేదు. పుట్టింట తండ్రి ఆరోగ్య రీత్యా గత కొద్ది రోజులుగా వేధింపులు కన్నవారికి చెప్పలేదు. బుధవారం రాత్రి 8 గంటలకు వీడియో కాల్ ద్వారా ప్రియాంక తల్లిదండ్రులతో మాట్లాడింది. 9 గంటలకు శివ శంకర్ తన ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది వెంటనే రమ్మని టెక్కలికి ఫోన్ చేశాడు. వెంటనే వీరందరూ కొరాపుట్ చేరుకొని అనుమానంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా మృతురాలి తలపై ఇనుప రాడ్డుతో మోది చంపినట్లు తెలిసింది. దీంతో వెంటనే శివ శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రియాంక చనిపోయాక శివశంకర్ తన తల్లిని, ఏడు నెలల కుమార్తెను ఇంటి బయట కూర్చోబెట్టాడు. అనంతరం మృతదేహాన్ని దహనం చేసి ఇంటికి నిప్పంటించాడు. మొదటి అంతా ఇది అగ్ని ప్రమాదమే అనుకున్నారు. కానీ మృతురాలి తల్లిదండ్రులు రావడంతో అసలు విషయం బయటపడింది. పోలీసుల విచారణలో శివ శంకర్ తన నేరం అంగీకరించారు.

చైన్‌స్నాచింగ్ ముఠా అరెస్టు

- నిందితులంతా ట్రాన్స్‌జెండర్లే
- 38 గ్రాముల బంగారు గొలుసులు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మణరావు

నరసన్నపేట: ఉత్తరాంధ్రతో పాటు పలుచోట్ల ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న పురుషులే లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ట్రాన్స్‌జెండర్స్ ముఠాను నరసన్నపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు శుక్రవారం నరసన్నపేటలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఇటీవల నరసన్నపేట మండలం ఉర్లాం సమీపంలో నడగాంకు చెందిన దొంపాక ఆనందరమణను కొందరు ట్రాన్స్‌జెండర్ల అడ్డగించి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేయగా ముఠా పట్టుబడింది. ఉర్లాంతో పాటు ఇచ్ఛాపురం, జి.సిగడాం మండలం ఉల్లివలస జంక్షన్, పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబల్లి మండలం సంకిలిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. బైక్‌లపై వచ్చిన వారి మెడలో నుంచి బంగారు చైన్లు లాక్కొని సమీపంలో ఉన్న కారులో వీరు పారిపోతుంటారు. ఈ కేసులో తెర్లాం మండలం పిరిడి గ్రామానికి చెందిన నందిగామ నేహా, కాకినాడ జిల్లా రేచర్లపేటకు చెందిన మండల శ్రావణి, పార్వతీపురం జిల్లా వీరఘట్టంకు చెందిన అలుబిల్లి ప్రియ, రంపచోడవరం ప్రాంతానికి చెందిన బేదంపూడి సాయిపల్లవి, పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన నాగిరెడ్డి సుష్మలతో పాటు వీరికి సహాయకారిగా ఉన్న కారు డ్రైవర్ తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరికి చెందిన సేలం రాంప్రవీణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరందరినీ మడపాం టోల్‌గేట్ వద్ద శుక్రవారం పట్టుకొని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. వీరి వద్ద నుంచి 38 గ్రాముల బరువున్న మూడు బంగారు చైన్లు రికవరీ చేశారు. నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, నరసన్నపేట, పోలాకి ఎస్ఐలు సీహెచ్ దుర్గాప్రసాద్, రంజిత్‌లు కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్నందుకు డీఎస్పీ అభినందించారు.

వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల : ఏపీఈఏపీ సెట్–2025 ప్రవేశ పరీక్షకు హాజరైన బైపీసీ విద్యార్థులకు సంబంధించి బీ–ఫార్మసీ, ఫార్మా–డీ, బయో/ఫుడ్ టెక్నాలజీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు వెబ్ కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదలైందని జిల్లా ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయక కేంద్రం జిల్లా సమన్వయకర్త కె.నారాయణరావు శుక్రవారం తెలిపారు. తొలి విడతగా ఈ నెల 12 నుంచి 18 వరకు, తుది విడతగా ఈ నెల 25 నుంచి 29 వరకూ ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. 21న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

నిబంధనలకు నీళ్లు!



- పెట్రోల్, డీజిల్లో నీరు కలుస్తోందంటూ వినియోగదారుల గగ్గోలు
- బంకుల్లో కానరాని సౌకర్యాలు
- తనిఖీలు చేయని అధికారులు

సంతబొమ్మాళి మండలం బోరుభద్ర పెట్రోల్ బంక్‌లో గొదలాం గ్రామానికి చెందిన పాలిన శ్రీనివాసరావు వంద రూపాయల పెట్రోల్ కొట్టించాడు. రెండు రోజుల వ్యవసాయ పనుల తర్వాత వాహనాన్ని స్టార్ట్ చేయాలని చూడాగా అవ్వకపోవడంతో మెకానిక్‌కు చూపించాడు. పెట్రోల్‌లో నీరు కలవడం వల్ల బండి స్టార్ట్ కావడం లేదని చెప్పడంతో విషయాన్ని బంకు యజమాని దృష్టికి తీసుకెళ్లాడు. ఆయన పట్టించుకోకపోవడంతో తహసీల్దార్ హేమసుందర్‌రావుకు ఫిర్యాదు చేశాడు. గత నెలలో ఈ ఘటన జరిగింది. ఇలాంటివి తరచూ ఎక్కడో ఓ చోటు జరుగుతున్నా అధికారులు దృష్టి సారించడం లేదు.

శ్రీకాకుళం: పెట్రోల్, డీజిల్ కల్తీ జరుగుతోందంటూ ఇటీవల కాలంలో పలువురు వాహనచోదకులు ఆందోళనకు దిగుతున్నారు. పలువురు నిర్వాహకులు కొలతల్లో వ్యత్యాసం, కల్తీకి పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్రోల్ బంకులపై ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన అధికారులు మౌనముద్రలో ఉండిపోవడంపై పలువురు ఆక్షేపిస్తున్నారు. పెట్రోల్ డీజిల్ నాణ్యత లేకపోవడం వల్ల వాహనాలు తరచూ మరమతులకు గురవుతున్నాయి. వాస్తవానికి బంకు నిర్వహించే డీలర్లకు ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు యాజమాన్యాలు కమిషన్ సక్రమంగానే చెల్లిస్తున్నా కొందరు యజమానులు అత్యాశకు పోయి కల్తీలకు, కొలతల్లో వ్యత్యాసాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో 149 పెట్రోల్ బంకులు ఉండగా, వీటి ద్వారా రోజుకు పెట్రోల్ ,డీజిల్ కలసి మూడు లక్షల లీటర్ల వరకు విక్రయిస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

నిబంధనల మేరకు ప్రతి పెట్రోల్ బంక్‌లోనూ ఉచితంగా గాలిని నింపే యంత్రాలతో పాటు వినియోగదారులకు తాగునీరును అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. బంక్ ఆవరణలో మరుగుదొడ్లు కచ్చితంగా ఉండాలి. గాలి యంత్రాలు ఉన్నప్పటికీ అవి అలంకారప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. ఎవరైనా గాలి కోసం అడిగితే దానిని నిర్వహించే వ్యక్తి సెలవులో ఉన్నాడనో మరేదో కారణం చెప్పి పంపించేస్తున్నారు. మరుగుదొడ్లు ఉన్నట్లు బోర్డులు ఉన్నా వాటికి తాళాలు వేసి ఉంచుతున్నారు. దాదాపుగా 90 శాతం బంకుల్లో మంచి నీటి సౌకర్యమే ఉండడం లేదు. ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్న బంకుల్లోనే కాకుండా ప్రభుత్వ శాఖల ఆధీనంలో ఉన్న బంకుల్లో సైతం దాదాపు ఇదే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బంకులపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు..

తనిఖీలు చేస్తాం..

పెట్రోల్ బంకులపై దృష్టి సారిస్తాం. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం. త్వరలోనే పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేస్తాం.

– చిన్నమ్మలు, తూనికలు కొలతల శాఖ అధికారి

పిడుగుపాటుకు వృద్ధుడు మృతి



శిమ్మయ్య(ఫైల్)

హిరమండలం: పిండ్రువాడ కాలనీకు చెందిన దువ్వ శిమ్మయ్య (70) శుక్రవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దువ్వ శిమ్మయ్య, కుమారుడు హరికృష్ణ కలిసి ఎప్పటిలాగే మంగళవారం కూడా గొర్రెలు మేపేందుకు వెళ్లారు. సాయంత్రం పొలంలో గొర్రెలు కాస్తుండగా ఒక్కసారిగా శిమ్మయ్యపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో కుమారుడికి ఎటువంటి గాయాలు కాలేదని గ్రామస్తులు తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్ : గుజరాతీపేటలో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు శుక్రవారం పేర్కొన్నారు. సీమేన్‌గా పనిచేస్తున్న బర్రి నాగరాజుకు 13 ఏళ్ల కొందట వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. తనను తరచూ వేధిస్తున్నాడంటూ భార్య ఇటీవలే పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మనస్థాపానికి గురైన నాగరాజు శుక్రవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

టెక్కలి రూరల్: టెక్కలి డిగ్రీ కాలేజీ వెనుకనున్న మామిడి తోటలో శుక్రవార రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతదేహం కింద మంట ఉండటం, పైన ఉరి వేసుకొని వేలాడుతుండటంతో హత్యా?ఆత్మహత్యా తెలియడం లేదు. పోలీసులు వచ్చి పరిశీలించగా.. మృతుడు స్థానిక ఎన్టీఆర్ కాలనీ 9వ లైన్‌లో నివాసముంటున్న ప్రధాన గణపతి(50)గా గుర్తించారు. మృతుడి భార్య సుమిత్రో ప్రధాన్ ఫిర్యాదు మేరకు టెక్కలి ఎస్సై రామ్ అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడు రెండు రోజులుగా కనిపించడం లేదని, ఎక్కడికో వెళ్లి ఉంటాడని భావిస్తున్న తరుణంలో ఈ ఘటన చోటు చేసుకుందని మృతుడి భార్య తెలిపింది.

లైసెన్స్ లేని బాణసంచా జప్తు

నందిగాం: మండలకేంద్రమైన నందిగాంలో ప్రగడ బాబూరావు అనే వ్యక్తి లైసెన్స్ లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన రూ.లక్షా ఎనిమిది వేల విలువైన బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై షేక్ మహమ్మద్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.